సాక్షి
కుమురం భీం

బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



గల్లీ నుంచి ఢిల్లీ దాకా
ఆదిలాబాద్ నుంచి లోక్‌సభకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఒకప్పుడు కేంద్రంలో చక్రం తిప్పారు. జాతీయ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు. 8లో▸



శివపార్వతుల కల్యాణం
ఇందిరానగర్‌లోని స్వయంభూ మహంకాళి ఆలయంలో జాతర మహోత్సవం ప్రారంభమైంది. మొదటి రోజు శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
39.5 /27.1
ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. వేడి, ఉక్కపోత చాలా వరకు తగ్గుతుంది. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆరో రోజు ఆరు నామినేషన్లు



నామినేషన్ పత్రాలు అందిస్తున్న ఆత్రం సక్కు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి మంగళవారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు తన తొలి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, జాదవ్ అనిల్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, మైనార్టీ నాయకుడు యూనిస్ అక్బానీతో కలిసి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు తన నామినేషన్ పత్రాలను అందజేశారు. అలాగే సక్కు తరఫున ఎమ్మెల్సీ దండే విఠల్, నాయకులు జాన్సన్ నాయక్, లోలం శ్యాంసుందర్, రాంకిషన్‌రెడ్డి, మర్సుకోల సరస్వతి రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఇండియా ప్రజా బంధు పార్టీ తరఫున పట్టణంలోని టీచర్స్‌కాలనీకి చెందిన గేడం సాగర్ రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా గంగాదేవి రెండోసెట్, స్వతంత్ర అభ్యర్థిగా ఉట్నూర్ మండల కేంద్రంలోని బోయవాడకు చెందిన చవాన్ రాము నామినేషన్ దాఖలు వేశారు. తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి కలెక్టరేట్‌లోని ఆర్‌వో కార్యాలయంలో కలిసి అందించారు. నామినేషన్ల సంఖ్య 12కు చేరింది.

ఐదు నెలలకే 'టాప్' లేచిపోయింది



ఎనోలి కొలాంగూడలో దెబ్బతిన్న ఆత్రం మారుతి ఇల్లు

వాంకిడి(ఆసిఫాబాద్): పీవీటీజీ గ్రామాల్లో అత్యంత వెనుకబడిన గ్రామాల్లో కొలాం గిరిజనులకు ఐటీడీఏ నిధులతో నిర్మించిన ఇళ్లు నెలలు గడవకముందే దెబ్బతింటున్నాయి. ఇటీవల వీచిన గాలివానకు వాంకిడి మండలం ఎనోలి కొలాంగూడ గ్రామంలో పలు గృహాల పైకప్పు ఎగిరిపోవడం వాటి నాణ్యతకు అద్దం పడుతోంది. కొలాం గిరిజనులకు పక్కా ఇళ్ల నిర్మాణం కోసం ఐటీడీఏ ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షలు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఇష్టారీతిన నిర్మాణాలు చేపట్టారనే ఆరోపణ ఉన్నాయి. నాణ్యతను పర్యవేక్షించాల్సిన ఇంజినీరింగ్ శాఖ అధికారులు సైతం 'మాములు'గా వ్యవహరించారని లబ్ధిదారులు అంటున్నారు. ఎనోలి కొలాంగూడ గ్రామంలో ఐదుగురు లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. గతేడాది ఆగస్టులో భూమి పూజ చేయగా.. కాంట్రాక్టర్ మూడు నెలల్లో పనులు పూర్తి చేశాడు. ఇళ్లు పూర్తయి ఐదు నెలలవుతుండగా ఆదివారం, సోమవారం వీచిన ఈదురు గాలులకు ఇళ్లు దెబ్బతిన్నాయి. ఆత్రం మారుతి, సిడాం భీంరావుకు చెందిన ఇళ్ల రేకులు లేచిపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. ఆత్రం పోత, సిడాం పగ్గు, మడావి అయ్యులకు చెందిన ఇళ్లు కూడా దెబ్బతిని ఉరుస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి దెబ్బతిన్న ఇళ్లకు నాణ్యతతో కూడిన మరమ్మతులు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు



జై హనుమాన్!

పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, తదితరులు



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో కిటకిటలాడాయి. కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో అర్చకులు ఒర్సుల శిరీష్‌శర్మ, మాడుగుల నారాయణమూర్తి, మహేశ్‌శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ తర్వాత కలశ గణపతి పూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం, పూర్ణాహుతి చేపట్టారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, మాజీ సర్పంచ్ మర్సుకోల సరస్వతి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిలువేరు వెంకన్న, ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, వెంకన్న, పిన్న వివేక్, రూప్‌నర్ రమేశ్, సుధాకర్, లక్ష్మణమూర్తి, రాధాకృష్ణాచారి, తుజాల్‌పూర్ మురళీధర్ గౌడ్, ఎకిరాల శ్రీనివాస్, సతీశ్, రాజు, డాక్టర్ మధు తదితరులు పూజల్లో పాల్గొన్నారు. బజార్‌వాడి హనుమాన్ మందిర్‌తోపాటు పలు ఆలయాల్లో అన్నదానాలు చేపట్టారు. బ్రాహ్మణవాడ పండరినాథ్ ఆలయంలో అర్చకులు అనంత్‌శర్మ ఆధ్వర్యంలో వార్షికోత్సవం నిర్వహించారు. స్థానిక వ్యాపారి సాయిని సంతోష్ తాగునీటిని పంపిణీ చేయగా.. వివిధ సంఘాల ఆధ్వర్యంలో మజ్జిగ, అరటిపండ్లు అందజేశారు.

అడ్డగోలుగా అక్రమార్జన!

- ఏసీబీకి చిక్కకుండా కొంతమంది ప్రభుత్వ అధికారుల ఎత్తులు
- కిందిస్థాయి ఉద్యోగులు, మధ్యవర్తులతో వసూళ్లు
- బంధువులు, బినామీల పేరుతో భూముల కొనుగోళ్లు
- ఆదాయానికి మించి ఆస్తులు కూడబెడుతున్న వైనం
- అవినీతి నిరోధక శాఖకు కొత్త సవాళ్లు



సాక్షి, ఆసిఫాబాద్: లంచం పుచ్చుకుంటున్న ప్రభుత్వ అధికారుల్లో కొద్దినెలల నుంచి అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు దడ పుట్టిస్తున్నారు. గతేడాది నవంబర్ 23న చింతలమానెపల్లి ఎస్సై వెంకటేశ్ రూ.20,000, ఈ నెల 15న ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా ఎస్సై రాజ్యలక్ష్మి రూ.25,000 లంచం తీసుకుంటుండగా అధికారులకు పట్టుబడ్డారు. వీరిద్దరూ నేరుగా నగదు రూపంలో లంచం ఆశించి అందుకున్నవారు. ఇదే సమయంలో నేరుగా లంచం పుచ్చుకోకుండా తెలివిగా అక్రమార్జనలో కొందరు అధికారులు మునిగితేలుతున్నారు. తమ కిందిస్థాయి ఉద్యోగులు, వాహన డ్రైవర్లు, మధ్యవర్తులు, ఏటీఎం విధానం ద్వారా అడ్డగోలుగా లంచం గుంజుతున్నారు. ఇలా సమకూరిన డబ్బులతో కుటుంబ సభ్యులు, బంధువుల పేర ఆస్తులు కూడబెట్టుకుంటున్నారు. జిల్లాలో మూడేళ్ల నుంచి ఏసీబీ అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు గల ప్రభుత్వ అధికారుల్లో ఒకరిని కూడా పట్టుకున్న దాఖలాల్లేవు.

మచ్చుకు కొన్ని..

- ఆయన రెవెన్యూ శాఖలో ఆర్డీవో స్థాయి ఉద్యోగి. ఆ శాఖలో ఉద్యోగం పొందిన తర్వాత ఎక్కువ కాలం ఒకేచోట పనిచేశారు. ఈయన హయాంలో జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయి. గిరిజన భూముల్లో గిరిజనేతరులు వెంచర్లు వేసి విక్రయించారు. నాలుగు వరుసల రహదారి పనుల్లో భాగంగా భూములు కోల్పోయిన కొందరు రైతులకు ఆయాచిత లబ్ధి చేకూర్చి వారి నుంచి రూ.కోట్లు సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఓ వెంచర్‌లోని కొంత భూమి నాలుగు వరుసల రహదారికి కేటాయించగా.. ఆ వెంచర్ యజమానులకు సదరు అధికారి రూ.4 కోట్లపైగా నష్టపరిహారం అక్రమ పద్ధతిలో ఇప్పించి వారి నుంచి రూ.65 లక్షలు లంచం తీసుకున్నారనే విషయంపై మీడియాలో వరుస కథనాలు వచ్చాయి. అక్రమార్జన ద్వారా వచ్చిన డబ్బుతో జిల్లా కేంద్రంలో కుమారుడి పేరిట పదుల సంఖ్యలో ప్లాట్లు, నిర్మల్‌లో 8 ఎకరాల వరకు వ్యవసాయ భూమి కొన్నారు. వీటితోపాటు ఇచ్చోడ వద్ద వ్యవసాయ భూమిలో రూ.50 లక్షలతో ఒక ఫాంహౌస్ నిర్మించారు. వీటన్నింటిని తన కుటుంబ సభ్యులు, బంధువుల పేర రిజిస్ట్రేషన్ చేయించారు. ప్రస్తుతం ఈయన మంచిర్యాల జిల్లాలో పని చేస్తున్నారు.
- ఆసిఫాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఇష్టానుసారం భూముల కొలతల్లో చేతివాటం ప్రదర్శించి రూ.కోట్లు సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆసిఫాబాద్ శివారులోని ఓ వెంచర్‌కు సంబంధించిన కొంత భూమి హైవేలో పోతుండగా.. దానికి ఆనుకునే ఉన్న ఎకరా ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా మార్చినందుకు యజమానుల నుంచి రూ.30 లక్షలు లంచం తీసుకున్నట్లు తెలిసింది. అలాగే గుండి రహదారి సమీపంలోని హైవే పక్కనే ఓ మహిళకు చెందిన పట్టాభూమి సర్వే నంబర్ మార్చి ఆ భూమిని ఇతరుల పేరిట భూ రికార్డుల్లో నమోదు చేయించాడు. అందుకుగాను రూ.18 లక్షల నజరానా అందుకున్నట్లు తెలుస్తోంది. మరో వెంచరులోనూ ప్రభుత్వ భూమిని పట్టాభూమిగా మార్చడం ద్వారా రూ.25 లక్షల లబ్ధి పొందారనే ఆరోపణలు ఉన్నాయి. ఆసిఫాబాద్‌లోని పలు ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తులకు కేటాయించి రూ.లక్షలు ఆర్జించినట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్ ఎన్‌జీవో కాలనీలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి అందులో ఇల్లు నిర్మించనున్నాడు. ఆసిఫాబాద్‌లో వెలసిన కొన్ని వెంచర్లలో ప్లాట్లను కుటుంబ సభ్యులు, బినామీల పేర రిజిస్ట్రేషన్ చేయించాడు. ఎన్నికలకు ముందు సదరు ఉద్యోగి నిర్మల్‌కు బదిలీపై వెళ్లారు.
- జిల్లాలో అటవీశాఖ రేంజ్ అధికారి ఒకరు స్మగ్లర్లకు సహకరించడం ద్వారా అవినీతికి పాల్పడుతున్నారు. ఆయన కొన్నేళ్ల నుంచి ఒకే రేంజ్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. కలప స్మగ్లింగ్ ఎక్కువగా ఇక్కడే జరుగుతోంది. స్మగ్లర్లు నేరుగా ఆయనతో అవగాహన కుదుర్చుకుంటున్నారు. ఎడ్లబండ్లు, సుమో, జీపులు, టాటా ఏస్‌ల ద్వారా స్మగ్లింగ్ చేసేందుకు ఆయన సహకరిస్తారు. ప్రతీ ఎడ్లబండికి నెలకు రూ.10 వేల చొప్పున ఇవ్వాలన్నది ఒప్పంద సారాంశం. ఇతర వాహనాలకు వేర్వేరుగా రేటు నిర్ణయించారు. అయితే డబ్బులను స్మగ్లర్లు నేరుగా ఆయనకు అందజేయరు. తమ పేర బ్యాంకులో అకౌంట్ ఓపెన్ చేసి ఆ ఏటీఎం కార్డులను రేంజ్ అధికారి చేతిలో పెడుతున్నారు. ఒప్పందం ప్రకారం స్మగ్లరు నెలనెలా లక్షలాది రూపాయలు బ్యాంకులో జమ చేయగానే తన వద్ద ఉన్న ఏటీఎం కార్డు ద్వారా వాటిని తీసుకుంటున్నారు. ఏసీబీకి చిక్కకుండా ముందు జాగ్రత్తగా ఏటీఎం పద్ధతిన తన అక్రమార్జన కొనసాగిస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల పేర రూ.కోటికి పైగా విలువ చేసే ప్లాట్లు, భూములు కొనుగోలు చేశారు.

జిల్లా పోలీసు శాఖ, రెవెన్యూ శాఖలో పని చేస్తున్న కొందరు అధికారులు రెండు చేతులా మామూళ్ల రూపంలో వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మద్యం వ్యాపారులు, ఇసుక ట్రాక్టర్ల యజమానుల నుంచి ప్రతినెలా మామూళ్ల రూపంలో ఒక్కో పోలీసు అధికారి రూ.లక్ష వరకు తీసుకుంటున్నారు. వారి వద్ద పనిచేస్తున్న కొందరు కానిస్టేబుళ్లు నెలనెలా వసూలు చేస్తున్నారు. ఇలా మామూళ్ల రూపంలో వచ్చిన సొమ్ముతో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాల పట్టణాల్లో ఆస్తులు కొనుగోలు చేస్తున్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ రెవెన్యూ పరిధిలోని భూములకు విపరీతమైన డిమాండ్ పలుకుతోంది. ఇదే అదనుగా రెవెన్యూ శాఖ అధికారులు కొందరు తమ శాఖలోని అధికారులకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుతూ ఇక్కడే పాతుకుపోయారు.

ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని, ఈ నెల 25 తర్వాత తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని తెలిపారు. హోం ఓటింగ్ కోసం దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన వృద్ధులు ఫాం 12డీ దరఖాస్తులు అందించాలన్నారు. రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాలని సూచించారు. ఈ నెల 25 తర్వాత ఓటర్ స్లిప్పుల పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. సరిహద్దుల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో లోకేశ్వర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నోడల్ అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, డీఆర్వో లోకేశ్వర్‌రావుతో కలిసి నోడల్ అధికారులతో మంగళవారం ఎన్నికల ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేయలెన్స్, వీడియో సర్వేయలెన్స్, వీడియో పరిశీలన, సహాయ ఖర్చుల పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలు, ఎంసీ కంట్రోలింగ్ రూమ్, ఖర్చుల పర్యవేక్షణ కమిటీలు, ఎన్నికల సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో ఆదిలాబాద్‌లో జరిగే సమావేశానికి హాజరు కావాల్సి ఉంటుందన్నారు. మే 9 నుంచి సెక్టార్ అధికారులకు వాహనాలు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో నిర్వహించిన తనిఖీల్లో రూ.1.41 కోట్లు సీజ్ చేశామని, సంబంధిత వ్యక్తులు సరైన ఆధారాలతో కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్‌లో సంప్రదించి నగదు తీసుకెళ్లాలని సూచించారు. మే 13న ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ఏనుగులు జనావాసాల్లోకి రాకుండా చర్యలు

- వన్యప్రాణుల సంరక్షణను బాధ్యతగా నిర్వర్తించాలి
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ బి.సంతోష్



మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఏనుగుల ఆవాసాలు గుర్తించాలని, జనావాసాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని వన్యప్రాణుల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. మంగళవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో టైగర్ రిజర్వ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, ఫీల్డ్ డైరెక్టర్ ఆఫ్ ఫారెస్ట్ ఎస్.శాంతారామ్, జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్ అటవీ అధికారులు శివ్ ఆశిష్ సింగ్, నీరజ్‌కుమార్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్, ల్యాండ్ స్కేప్ జాతీయ సమన్వయకర్త భూమి నాథన్, ఏనుగుల ప్రత్యేక కన్జర్వేషన్ నవనీథన్, పశ్చిమబెంగాల్ డబ్ల్యూడబ్ల్యూఎఫ్ అసిస్టెంట్ మేనేజర్ కుల్‌దీప్‌రాయ్‌లతో కలిసి పోలీసు, అటవీ, రెవెన్యూ అధికారులతో వన్యప్రాణులు, మానవ సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ వన్యప్రాణులతోపాటు మానవ జీవన సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. ఏనుగులు అటవీ ప్రాంతాల్లోనే ఉండే విధంగా తాగునీరు, ఆహారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని, అడవిలో ఆక్రమణకు గురైన అటవీ భూ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుని వన్యప్రాణులకు ఆహారం అందించే విధంగా పండ్ల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏనుగులు జనావాసాల్లోకి వచ్చినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తలు, ప్రవర్తన తీరుపై అప్రమత్తంగా ఉండాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తక్షణ చర్యల్లో భాగంగా 144సెక్షన్ అమలు చేసే విధంగా చూడాలని తెలిపారు. దట్టమైన అటవీ ప్రాంతంలో తక్కువ సంఖ్యలో ఉన్న నివాసాలను ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడి భద్రతా వాహనాలు, డ్రోన్‌లు, నైట్‌విజన్ పరికరాల ద్వారా వన్యప్రాణుల కదలికలను గుర్తించి చర్యలు తీసుకుంటామని, సంబంధిత నివేదికలను ట్రాకింగ్ సెల్‌కు పంపిస్తామని తెలిపారు. విద్యుత్, పంచాయతీ, పశు సంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గతేడాది వేసవి సెలవుల్లో ఏప్రిల్ 28న బెజ్జూర్ మండలం కుకడ గ్రామానికి చెందిన విద్యార్థి నితీశ్(16) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తమ్ముడు యశ్వంత్‌కు బైక్ డ్రైవింగ్ నేర్పించేందుకు బైక్‌పై కొత్తగూడ గ్రామం వైపు నితీశ్ తీసుకెళ్లాడు. బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. నితీశ్ అక్కడికక్కడే మృతి చెందగా.. యశ్వంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మైనర్లు బైక్ ఇవ్వడంతో అవగాహన లేక ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

తిర్యాణి మండలం రొంపెల్లికి చెందిన పెందూర్ మహిపతిరావు, విజయ దంపతుల కుమారుడు యోనస్(12). గతేడాది మే 13న వేసవి సెలవుల్లో తల్లి విజయ షాంపు తీసుకు రావాలని కుమారుడు యోనస్‌కు చెప్పింది. అతడు వెళ్లనని చెప్పడంతో తల్లి మందలించింది. మనస్తాపానికి గురైన యోనస్ క్షణికావేశంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించారు.

మండుటెండల్లో పదిలం!

- నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు
- ఇళ్ల వద్ద విద్యార్థులపై దృష్టి తప్పనిసరి
- ప్రాణాల మీదకు తెస్తున్న ఈత సరదా
- మైనర్లకు వాహనాలు ఇచ్చినా ప్రమాదమే..!
- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచన



ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన బాలికల గురుకులం నుంచి ఇళ్లకు వెళ్తున్న విద్యార్థినులు

కౌటాల(సిర్పూర్): పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. పిల్లలకు సెలవులు అంటేనే ఆటవిడుపు.. ఎక్కడా లేని సంతోషంతో తోటి స్నేహితులతో ఆటలతోనే రోజంతా గడుపుతారు. సరదా కోసం వారు చేసే కొన్ని పనులు ప్రాణాల మీదకు తెచ్చే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో వడదెబ్బ బారిన పడే ప్రమాదం సైతం ఉంటుంది. విద్యార్థులు సెలవులు వృథా చేసుకోకుండా ఓ వ్యాపకం ఉంటే భవిష్యత్తులో వారి ఉన్నతికి తోడ్పడుతుంది. ఈ దిశగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి.

పద్దెనిమిదేళ్లలోపు వారు 1.43 లక్షల మంది..

గత నెలలోనే ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు పూర్తయ్యాయి. వారికి ఇప్పటికే వేసవి సెలవులు ప్రకటించారు. బుధవారం నుంచి జూన్ 11 వరకు పాఠశాల విద్యార్థులు 1వ తరగతి నుంచి 9వ తరగతి వారికి వేసవి సెలవులు ప్రకటించారు. ఈ నెల 15 నుంచి ప్రారంభమైన సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు 22 వరకు కొనసాగాయి. జిల్లాలో 3 నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 45,260 మంది ఉన్నారు. అలాగే ఆరేళ్ల నుంచి 16 ఏళ్లలోపు వారు 79,314 మంది, 16 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు వారు 17,060 మంది ఉండగా.. జిల్లాలో మొత్తం పద్దెనిమిదేళ్ల లోపు వారు 1.43 లక్షల మందికి పైగా ఉన్నారు.

జలగండమే అధికం..

జిల్లాలో ప్రాణహిత, పెన్‌గంగ, పెద్దవాగు, వార్దా వంటి జీవనదులు ప్రవహిస్తున్నాయి. ఇవి వేసవిలోనూ జలకళతో ఉంటాయి. కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్, దహెగాం, ఆసిఫాబాద్ మండలాలకు సమీపంలో పెద్దవాగు, వాంకిడి మండలంలో చిక్లివాగు, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాలకు సమీపంలో ప్రాణహిత నది, సిర్పూర్(టి)లో పెన్‌గంగ, వార్దా నదులు ప్రవహిస్తున్నాయి. సమీప గ్రామాల ప్రజలు నిత్యం ఇక్కడికి స్నానాల కోసం వెళ్తుంటారు. ఏటా ఈతకు వెళ్లి పలువురు మృత్యువాత పడిన ఘటనలూ ఉన్నాయి. ముఖ్యంగా విద్యార్థులు వేసవిలో స్నేహితులతో కలిసి సరదా కోసం బావులు, నదుల వద్దకు ఈతకు వెళ్తుంటారు. అయితే నదులు, బావుల్లో లోతును అంచనా వేయకుండా లోపలికి దిగుతుండటంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. తోటివారిని రక్షించే ప్రయత్నంలో వెంట వెళ్లిన వారు సైతం ప్రమాదాల బారిన పడుతుంటారు. అయితే ఎక్కడా కూడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

వ్యసనాల బారిన పడే అవకాశం

ఇటీవల యువత టీనేజీ నుంచే వ్యసనాలకు అలవాటు పడుతున్నారు. చెడు స్నేహాలతో గంజాయి, మద్యం, సిగరేట్లకు బానిసలవుతున్నారు. అలాగే బైక్‌లతో రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. అతివేగం కారణంగా జరిగే ప్రమాదాలు ఆయా కుటుంబాల్లో విషాదం నింపుతున్నాయి. ఆన్‌లైన్‌లో బెట్టింగులు, గేమ్‌లకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు.


బడులకు సెలవులు



ప్రోగ్రెస్ కార్డులతో ఆసిఫాబాద్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, హెచ్‌ఎం సుభాష్

ఆసిఫాబాద్‌రూరల్: పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు సంతోషంగా ఇంటిబాట పట్టారు. గురుకులాలు, వసతి గృహాల్లో చదివే విద్యార్థులను తల్లిదండ్రులు వచ్చి తీసుకెళ్లారు. చివరి రోజు వారికి ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 12 వరకు వేసవి సెలవులు ఉంటాయని డీఈవో అశోక్ తెలిపారు. విద్యార్థులు ఎండకు తిరగకుండా, సరదా కోసం వాగుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాళ్లు శ్రీనాథ్, సురేశ్ సూచించారు.

పిల్లలపై దృష్టి సారించాలి



వేసవి సెలవుల్లో పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి. నదులు, చెరువులు, బావుల వద్దకు ఈత కోసం పంపించవద్దు. ఈత రాని వారిని లోతు ఎక్కువగా ఉండే నీటి వనరులకు దూరంగా ఉంచాలి. నదుల వద్ద ప్రమాదాలు జరిగే స్థానాలను గుర్తించి సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తాం.

– కరుణాకర్, కాగజ్‌నగర్ డీఎస్పీ

క్లుప్తంగా

ఏడుగురి రిమాండ్

తాండూర్(బెల్లంపల్లి): రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్న క్రమంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఏడుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జగదీష్‌గౌడ్ తెలిపారు. ఈ నెల 20న పోలీసులు రేషన్ బియ్యం పట్టుకున్న సమయంలో ఫర్హానాబేగం, అమీనాబేగం, టీనాబేగం, ముభ్దం, మోసిన్, యూసఫ్, నరేష్ తాండూర్ పోలీసు స్టేషన్‌కు వచ్చి దుర్భాషలాడడమే కాకుండా పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై కేసు నమోదు కాగా మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

చోరీ కేసులో ఒకరు..



పోలీసుల అదుపులో నిందితుడు

కౌటాల: చోరీ కేసులో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఈ నెల 16న గుర్తుతెలియని వ్యక్తులు మండలంలోని బోదంపల్లి మధున పోచమ్మ ఆలయం గేటు తాళం పగులగొట్టి హుండీలోని డబ్బులు ఎత్తుకెళ్లారు. ఆలయ పూజారి పర్థాని పోచయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం మండల కేంద్రం లోని శివలింగపూర్ గ్రామ సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బోదంపల్లికి చెందిన గుర్లే శ్రీకాంత్ అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకుని విచారించగా ఆలయంలో చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి దొంగలించిన రూ.6,500 నగదును రికవరీ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

దాడి కేసులో ముగ్గురికి జరిమానా

భీమిని(బెల్లంపల్లి): దాడి కేసులో ముగ్గురికి జిల్లా కోర్టులో మంగళవారం జరిమానా విధించినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. 2020లో అక్కలపల్లి గ్రామానికి చెందిన చాపిడి శ్యాంబాబుపై అదే గ్రామానికి చెందిన చాపిడి విజయ్‌కుమార్, చాపిడి కమల, చాపిడి రాజ్‌కుమార్ గొడ్డలితో దాడిచేసి గాయపర్చారు. బాధితుడి తండ్రి దేవయ్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కొమురయ్య కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

బాలుడి అదృశ్యం



షేక్ అన్వర్

లింగాపూర్: మండలంలోని ఎల్లాపటార్ గ్రామానికి చెందిన షేక్ కులుషం కుమారుడు షేక్ అన్వర్ అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. లింగాపూర్‌లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న అన్వర్ (14) ఈ నెల 22న వార్షిక పరీక్షలు రాసేందుకు లింగాపూర్ వచ్చాడు. సాయంత్రం ఇంటికి తిరిగిరాకపోవడంతో బాలుని తండ్రి షేక్ కులుషం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గల్లీ నుంచి 'ఢిల్లీ'దాకా..

- ఎంపీలుగా.. కేంద్ర మంత్రులుగా ఎన్నిక
- జాతీయ స్థాయికి ఎదగిన నిర్మల్ నేతలు
- రిజర్వేషన్‌కు ముందు.. రాజకీయ కేంద్రం
- ఒకప్పుడు చక్రం తిప్పిన నాయకులు..
- ఈసారి ఎన్నికల్లో స్తబ్దుగా ఉన్న లీడర్లు

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024



వేణుగోపాలాచారి, కేంద్ర మాజీ మంత్రి



అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎంపీ



పొద్దుటూరి నర్సారెడ్డి, మాజీ ఎంపీ



పొద్దుటూరి గంగారెడ్డి, మాజీ ఎంపీ

నిర్మల్: దశాబ్దాలుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రాజకీయకేంద్రంగా నిర్మల్ కొనసాగింది. ఏళ్లపాటు ఉమ్మడిజిల్లాను శాసించింది. ఇక్కడి ప్రజాప్రతినిధులే ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్, ఢిల్లీ దాకా చక్రం తిప్పిన సందర్భాలున్నాయి. నిర్మల్ గల్లీల నుంచి ఢిల్లీ పార్లమెంట్ దాకా ఎదిగిన నేతలున్నారు. రాష్ట్రంలోనే కాదు.. కేంద్రంలోనూ మంత్రి పదవులు చేపట్టి జాతీయ స్థాయిలో నిర్మల్ పేరు నిలిపారు. ఎంతోమందిని లీడర్లుగా తీర్చిదిద్దారు. అలాంటి నేతలు ఇప్పుడు స్తబ్దుగా ఉంటున్నారు. పార్లమెంట్‌పోరులో సైలెంటుగా మారిపోయారు.

ఒకప్పుడు జిల్లాదే హవా..

ఉమ్మడి ఆదిలాబాద్ రాజకీయాల్లో నిర్మల్‌ది ప్రత్యేక స్థానం. ఇప్పటికీ ఇక్కడి నుంచి బీజేఎల్పీ లీడర్‌గా మహేశ్వర్‌రెడ్డి వంటి నేతలు రాష్ట్రస్థాయిలో ఉన్నారు. ఒకప్పుడైతే హైదరాబాద్, ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పారు. 2009 పార్లమెంట్ ఎన్నికల వరకూ నిర్మల్ నేతలదే హవా కొనసాగింది. ఎప్పుడైతే ఎస్టీ రిజర్వ్‌డ్‌గా ఎంపీ స్థానం మారిందో.. అప్పటి నుంచి నిర్మల్ ప్రాంత ప్రభావం తగ్గుతూ వచ్చింది. ఎస్టీ జనాభా ఎక్కువగా ఉండే ఆదిలాబాద్, ఆసిఫాబాద్ ప్రాంతాల ప్రాధాన్యం పెరిగింది. ప్రస్తుత ఎన్నికల్లోనూ మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆదిలాబాద్, ఆసిఫాబాద్ ప్రాంతాలకు చెందినవారే.

పొద్దుటూరి బ్రదర్స్..

సారంగపూర్ మండలం మలన్న చించోలి గ్రామానికి చెందిన పొద్దుటూరి నర్సారెడ్డి, పొద్దుటూరి గంగారెడ్డి రాష్ట్ర, జాతీయస్థాయి రాజకీయాల్లో రాణించారు. ఆరోజుల్లోనే పెద్ద పదవులు చేపట్టి ఆదర్శ నేతలుగా నిలిచారు. వరుసకు వీరిద్దరూ అన్నదమ్ములు. గ్రామస్థాయి నుంచి వీరు ఎదిగిన తీరు ఇప్పటి నేతలకూ ఆదర్శమే. ఇందులో పొద్దుటూరి గంగారెడ్డి 1967, 1971లో రెండుసార్లు ఎంపీగా గెలుపొందారు. 1978లో కాంగ్రెస్ రెడ్డి, ఇందిరా కాంగ్రెస్‌లుగా విడిపోయింది. అప్పటి అసెంబ్లీ ఎన్నికల్లో రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీచేసిన పొద్దుటూరి నర్సారెడ్డి, వరుసకు సోదరుడైన ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి గంగారెడ్డి చేతిలో ఓడిపోయారు. అలా గంగారెడ్డి రెండుసార్లు ఎంపీ, ఒకసారి ఎమ్మెల్యే అయ్యారు. ఇక నర్సారెడ్డి నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధించారు. 1962–67, 1967–72లలో వరుసగా రెండుపర్యాయాలు విజయాలు అందుకున్నారు. ఇక మూడోసారి 1972–77లో పోటీ లేకుండా ఆయన ఏకగ్రీవంగా గెలుపొందడం విశేషం. ఎమ్మెల్యే పదవిలో ఉంటూ 1964లో పీసీసీ చీఫ్‌గా కూడా వ్యవహరించారు. రాష్ట్ర భారీ నీటిపారుదల, రెవెన్యూ శాఖల మంత్రిగా పనిచేశారు. ఢిల్లీ బాటలో భాగంగా 1989లో నర్సారెడ్డి ఆదిలాబాద్ ఎంపీగానూ పోటీచేసి గెలిచారు. ఇటీవలే ఆయన మరణించారు. తమ సేవలతో ప్రజల్లో గంగన్నబాపు, నర్సన్నబాపుగా పేరొందిన వీరిద్దరూ తమ వారసులను రాజకీయాల్లోకి దింపకపోవడం గమనార్హం.

'చారి' శకం..

సముద్రాల వేణుగోపాలాచారి.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొన్నేళ్లపాటు ఎదురులేని నేతగా నోళ్లల్లో నానిన పేరు. దశాబ్దాలపాటు ఉమ్మడి జిల్లా రాజకీయాలను శాసించారు. నిర్మల్ గల్లీల్లో డాక్టర్‌గా తిరుగుతూ వైద్యసేవలందించిన ఆయన ఏకంగా ఢిల్లీలో కేంద్రమంత్రి దాకా ఎదిగారు. 1985 నుంచి వరుసగా.. 1989, 1994లలో నిర్మల్ అసెంబ్లీ తెలుగుదేశం అభ్యర్థిగా వేణుగోపాలాచారి హ్యాట్రిక్ విజయాలు సాధించారు. 1996లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, ఎంపీగా వెళ్లారు. అలా.. 1996, 1998, 1999 వరుస పార్లమెంట్ ఎన్నికల్లోనూ గెలిచి ఎమ్మెల్యే, ఎంపీగా డబుల్ హ్యాట్రిక్ సాధించిన నేతగా నిలిచారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న టీడీపీ తరఫున కేంద్ర విద్యుత్, వ్యవసాయశాఖ సహాయ మంత్రిగా చారి పనిచేశారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన 2014 నుంచి 2022 వరకు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా పనిచేశారు. 2023లో రాష్ట్ర ఐడీసీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఇటీవలే ఆయన బీఆర్‌ఎస్‌ను వీడి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

'అల్లోల' రాజకీయం..

ఉమ్మడిజిల్లా రాజకీయంలో నిర్మల్ నుంచే చక్రం తిప్పిన మరో కీలకనేత అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి. తెలుగుదేశం నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టి.. అదే పార్టీని ఓడించి జిల్లాలో కనుమరుగు చేశారు. జెడ్పీచైర్మన్‌గా ఉన్న ఆయన 1991లోనే టీడీపీ నుంచి ఆదిలాబాద్ ఎంపీగా గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. అప్పట్లో పార్టీ నిబంధనలకు విరుద్ధంగా మైనార్టీలో ఉన్న పీవీ నర్సింహారావు ప్రభుత్వానికి మద్దతు ప్రకటించి సంచలనంగా నిలిచారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరిన ఆయన 1999, 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. 2008లో ఎంపీగా మరోసారి గెలిచి ఢిల్లీకి వెళ్లారు. ఆ తర్వాత 2014 (బీఎస్పీ), 2018 (బీఆర్‌ఎస్) అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. పదేళ్లపాటు రాష్ట్ర అటవీ, దేవాదాయ, న్యాయశాఖ మంత్రిగా సేవలందించారు.

ప్రస్తుతం సైలెంట్..

జిల్లా నుంచి ఢిల్లీదాకా ఎదిగిన నేతల్లో ప్రస్తుతం అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, వేణుగోపాలాచారి వీరిద్దరే క్రియాశీలకంగా ఉన్నారు. ఇందులో వేణుగోపాలాచారి పదేళ్లుగా ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటున్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో మాజీగా మారారు. ప్రస్తుతం అటు కాంగ్రెస్‌లోకి వెళ్లకుండా, ఇటు బీఆర్‌ఎస్‌లో వెళ్లలేని పరిస్థితులు ఉండటంతో ఆయన సైలెంట్‌గా మారిపోయారు. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరినప్పటికీ వేణుగోపాలాచారి కూడా జిల్లాలో ఎక్కడా ప్రచారం చేపట్టడం లేదు.

108లో ప్రసవం



అంబులెన్స్‌లో బిడ్డతో సిబ్బంది

జన్నారం: మండలంలోని రోటిగూడకు చెందిన ఎస్.శోభ మంగళవారం ఉదయం పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు జన్నారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు లక్సెట్టిపేటకు రెఫర్ చేశారు. 108లో లక్సెట్టిపేట ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఎంటీ కిషన్, ఆశ వర్కర్ల సహాయంతో మహిళకు పురుడు పోయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇద్దర్నీ లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్‌లో చేరిన 'దాసారపు'



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన దాసారపు శ్రీనివాస్

మందమర్రిరూరల్(చెన్నూర్): మాజీ కాంగ్రెస్ నాయకుడు, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ముందు బీఎస్పీలో చేరిన డాక్టర్ దాసారపు శ్రీనివాస్ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితున్ని అయ్యానని, కాంగ్రెస్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

కారు రూపంలో కాటేసిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి
- కుమారుడిని బస్సెక్కించి ఇంటికి వెళ్తుండగా ఘటన



శ్రీనివాస్ (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సోమవారం అర్ధరాత్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిని కారు రూపంలో మృత్యువు కాటేసింది. ఎస్సై మహేందర్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం చందనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కాజీపేట శ్రీనివాస్(52) జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి కుమారుడు సాకేత్‌ను హైదరాబాద్‌కు పంపించేందుకు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి బస్సెక్కించాడు. ఇంటికి తిరిగివస్తుండగా ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు శ్రీనివాస్ బైక్‌ను ఢీకొట్టి సుమారు వందఫీట్ల దూరం ఈడ్చుకెళ్లింది. డ్రైవర్ కారును అక్కడే వదిలేసి పారిపోయాడు. తీవ్రగాయాలైన శ్రీనివాస్ కొనఊపిరితో కొట్టుకుంటుండగా అటుగా వెళ్తున్న ఓ ఆటోడ్రైవర్ గమనించి 100, 108కు సమాచారం అందించాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతునికి భార్య నర్మద శిరీష, కుమారులు సాకేత్, సౌమిత్రు ఉన్నారు. నర్మద శిరీష ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ ఏల్పుల విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆనందం ఆవిరైన వేళ

శ్రీనివాస్ ఈ నెల 21న ఓ కొత్త కారును కొనుగోలు చేశాడు. 22న కుటుంబ సభ్యుల సమక్షంలో కారుకు పూజలు సైతం చేయించారు. అతని ఆనందం తీరకుండానే మరో కారు రూపంలో మృత్యువు కబలించింది. ఆ కుటుంబాలో తీరని విషాదం నింపింది.

పీసీసీ మాజీ వైస్ ప్రెసిడెంట్ నాగయ్య మృతి

- సంతాపం తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి



నాగయ్య (ఫైల్)



శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే వివేక్

బెల్లంపల్లి: ఉమ్మడి రాష్ట్ర పీసీసీ వైస్ ప్రెసిడెంట్, తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు బెల్లంపల్లికి చెందిన తాటిపాముల నాగయ్య(81) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. రాత్రి ఇంట్లో భోజనం చేసిన తర్వాత వాకింగ్ చేస్తుండగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని బాబుక్యాంపుబస్తీలోని స్వగృహానికి తరలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. గాంధీభవన్‌లో కిసాన్ కాంగ్రెస్ జాతీయ నాయకుడు కోదండరెడ్డి, టీపీసీసీ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, తదితరులు నాగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంగళవారం ఉదయం ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, కె.ప్రేమ్ సాగర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావ్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, తదితరులు భౌతిక కాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. నాగయ్యకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. బెల్లంపల్లి పోచమ్మగడ్డ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆవుపై గుర్తుతెలియని దుండగుల దాడి



తీవ్రగాయాలతో ఆవు

బెల్లంపల్లిరూరల్: ఆవుపై గుర్తు తెలియని దుండగులు విచక్షణ రహితంగా దాడిచేసి గాయపర్చిన ఘటన మండలంలోని మాలగురిజాలలో చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చల్లూరి దయాకర్ ఆవు మంగళవారం ఉదయం మేతకు వెళ్లింది. రంగపేట శివారులోని చెరువు సమీపంలోని పొదల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఆవు నాలుగుకాళ్లు నరికివేశారు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు గమనించి దయాకర్‌కు సమాచారం అందించారు. ఆవును చూసిన బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపించారు. దయాకర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాచ్‌మెన్ విధుల నుంచి తొలగింపు

బెల్లంపల్లి: బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించిన మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల వాచ్‌మెన్ ఎండీ.నెహాల్‌ను విధుల నుంచి తొలగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎంఆర్‌ఈఐఎస్ రాష్ట్రర కార్యదర్శి ఆదేశాల మేరకు నెహాల్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఘటనపై ప్రధానోపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

వాచ్‌మెన్ అరెస్ట్

మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థితో అసభ్యంగా ప్రవర్తించిన వాచ్‌మెన్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎస్.దేవయ్య తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఆయన పేర్కొన్నారు.

26 నుంచి వేసవి క్రీడాశిబిరం

శ్రీరాంపూర్: సింగరేణి ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి వేసవి క్రీడాశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీరాంపూర్ డీజీఎం (పర్సనల్) అరవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపూర్‌లోని సింగరేణి ఉద్యోగుల పిల్లలకు మాత్రమే ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. శ్రీరాంపూర్ కాలనీలోని ప్రగతి మైదానంలో అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్ బాల్, నస్పూర్ కాలనీలోని సేవా భవన్‌లో వాలీబాల్, తాళ్లపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, ప్రాణహిత స్టేడియంలో ఫుట్‌బాల్ క్రీడల్లో 25 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 26న సాయంత్రం 5 గంటలకు ఆయా క్రీడా ప్రాంగణంలోని నిర్వాహకుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

శిక్షకులకు ఆహ్వానం..

క్రీడల్లో శిక్షణ ఇవ్వడానికి అర్హులైన పీఈటీలు, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రాతినిథ్యం వహించిన క్రీడాకారులను శిక్షకులుగా తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈశిక్షణ కాలానికి తగిన గౌరవ వేతనం అందిస్తామన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 25 సాయంత్రంలోగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు.

దేశీదారు పట్టివేత



స్వాధీనం చేసుకున్న దేశీదారు

మంచిర్యాలక్రైం: మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి సిరోంచకు తరలిస్తున్న దేశీదారు బాటిళ్లు పట్టుకున్నట్లు సీఐ బన్సీలాల్ తెలిపా రు. చంద్రపూర్ నుంచి అండమాన్ రైలులో దేశీదారు తరలిస్తున్నారనే సమాచారం మేరకు స్థానిక రైల్వే స్టేషన్, బస్టాండ్ మధ్యలో నిఘా ఉంచారు. అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు వ్యక్తులను తనిఖీ చేయగా వారి వద్ద 9 కాటన్ల దేశీదారు బాటిళ్లు లభ్యమయ్యాయి. సిరోంచకు చెందిన కొమ్మెరి తిరుమల్, జాడి రాజేశ్, జాడి రాహుల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గూడెంలో చైత్రపౌర్ణమి జాతర

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం చైత్రపౌర్ణమి జాతర ఘనంగా జరిగింది. జిల్లాతో పాటు కరీంనగర్, జగిత్యాల జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 132 జంటలు సామూహిక సత్యనారాయణవ్రతంలో పాల్గొన్నాయి. జాతర సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బాక్సింగ్‌లో ఉచిత శిక్షణ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో బాలబాలికలకు బాక్సింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తి రాజ్‌వీరు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీరోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు సాయంత్రం 4:30 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు బాక్సింగ్ కోచ్ సీహెచ్ రాజేశ్‌ను 9963539234 నంబరులో సంప్రదించాలని కోరారు.

మామిడిలో నాణ్యతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- రైతులకు హెచ్‌వో తిరుపతి సూచనలు



ఆర్.తిరుపతి, హెచ్‌వో



కాయలతో ఉన్న మామిడి చెట్టు

చెన్నూర్‌రూరల్: మంచిర్యాల జిల్లాలో సుమారు 18 వేల ఎకరాల్లో రైతులు ప్రస్తుతం మామిడి తోటల్లో కోతలు ప్రారంభమయ్యాయి. అవగాహన లేకుండా కోసిన మామిడికాయలు పక్వానికి రాక పోవడంతో సరైన ధర లేక రైతులు నష్టాల బారిన పడుతున్నారు. కోత సమయంలో చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే రైతులు లాభాలు గడించవచ్చని హెచ్‌వో ఆర్.తిరుపతి సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మామిడితోటల్లో కాయలు ముందుగా పక్వానికి వచ్చాయో లేదో తెలుసుకోవాలి. కోసిన కాయలను సైజుల వారీగా గ్రేడింగ్ చేసుకోవాలి. గ్రేడింగ్ అనంతరం వాటిని అట్ట ప్యాకింగ్ చేసుకోవాలి. ఎండ లేకుండా చల్లగా ఉన్న సమయాల్లో మాత్రమే కాయలు కోయాలి. కోసిన కాయలు చెట్టు మీద నుంచి కింద పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కాయలు కోసేందుకు సరైన పనిముట్లను వాడాలి. కర్రతో కొట్టి కాయలు కోయవద్దు. కాయలను కోసే సమయంలో వాటికి దెబ్బ తగలకుండా చూడాలి. సరైన మార్కెట్ ధర ఉన్న సమయంలోనే కాయలను కోసుకోవాలి. ఎక్కువగా ముదిరిన కాయలతో పాటు, లేత కాయలను కోస్తుంటారు. అలా చేయడం వల్ల వాటిని మగ్గబెట్టే సమయంలో సమస్య తలెత్తుతుంది. దీని వలన కాయలను కోసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా జాగ్రత్తలు పాటిస్తే కాయలు దెబ్బతినకుండా రైతులు లాభాలు గడించవచ్చు.

ఈదురు గాలులకు నేలరాలిన మామిడి



భీమారం: మామిడి కాయలు ఏరుతున్న రైతు



చెన్నూర్‌రూరల్: కాయలు ఏరుతున్న రైతు

చెన్నూర్‌రూరల్/భీమారం/జైపూర్/నెన్నెల: సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు జిల్లాలోని మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. చెన్నూర్ మండలంలోని రాలాయి, లంబడిపల్లి, కన్నెపల్లి, సంకారం, బుద్దారం, కొమ్మెర, అంగ్రాజ్‌పల్లి, కిష్టంపేట, లింగంపల్లి, భీమారం మండలంలోని భీమారం, ఆర్కెపల్లి, అంకుసాపూర్, పోలంపల్లి, జైపూర్ మండల కేంద్రంతో పాటు పెగడపల్లి, గంగిపల్లి, నర్సింగాపూర్, కుందారం, కిష్టాపూర్, శివ్వారం, టేకుమట్ల, ఇందారం, ముది గుంట, మిట్టపల్లి, నెన్నెల మండల కేంద్రంతో పా టు చిత్తపూర్, ఆవుడం, జోగపూర్, గొల్లపల్లి, మై లారం, కొత్తూర్, గంగారం, జెండావెంకటాపూర్ గ్రామాల్లోని మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

విద్యార్థులు గంజాయికి దూరంగా ఉండాలి

బెల్లంపల్లి: విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎవరైనా గంజాయి రవాణా చేసినా అక్రమంగా అమ్మకాలు సాగించినా నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎస్.దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి'

భీమారం: మహాలక్ష్మి పథకం అమలుతో వీధిన పడిన ఆటో డ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పెద్దపల్లి పార్లమెంట్ ఆటో జేఏసీ ఇన్‌చార్జి చెల్ల విక్రం కోరారు. మంగళవారం భీమారం మండల కేంద్రంలో ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ నెల 24న వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో పొట్ల మధుకర్, ఫక్రొద్దీన్, శంకర్ పాల్గొన్నారు.

బీసీలు చైతన్యవంతులు కావాలి

పాతమంచిర్యాల: మహనీయుల స్ఫూర్తిని అందిపుచ్చుకుని బీసీలు చైతన్యవంతులు కావాలని బీసీ ఐక్యవేదిక నాయకులు అన్నారు. జిల్లాలో 9 రోజుల పాటు యాత్ర చేపట్టిన వడ్డేపల్లి మనోహర్, నీరటి రాజన్న, చిందం వెంకటేష్, కోమటిరాజు, ఏదులాపురం రాజును మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, బీసీ నాయకులు కనుకుట్ల మల్లయ్య, అంజయ్య, సుదర్శన్, చంద్రమౌళి, మధుకర్, పిట్టల రవీందర్, వేముల మల్లేశ్ పాల్గొన్నారు.

చెన్నూర్‌లో 'కొప్పుల' ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కొప్పుల ఈశ్వర్

చెన్నూర్: పట్టణంలోని శివాలయంలో పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన రహదారిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందన్నారు. వంద రోజుల పాలనలో కాంగ్రెస్ మోసం బయటపడిందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను చీదరించుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.